క్లుప్తంగా

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

వనపర్తి టౌన్: దివ్యాంగ ఉద్యోగుల కన్వీనియన్స్ అలవెన్స్ రూ. 2వేల నుంచి రూ. 3వేలకు పెంచుతూ జీఓ నంబర్ 58జారీ చేయడంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శనివారం దివ్యాంగ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ... దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఎల్లప్పుడు సానుకూల వైఖరి కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి రామకృష్ణ యాదవ్, గౌరవ అధ్యక్షుడు అమర్, ఉపాధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



వనపర్తి: మండలంలోని మెంటపల్లి, నాచహళ్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోని ఆహ్వానించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన అందరికీ సముచిత స్థానం దక్కుతుందని వారికి పీసీసీ చీఫ్ చెప్పినట్లు మాజీ మంత్రి డాక్టర్ జి చిన్నారెడ్డి వెల్లడించారు. సమీప భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా ఆయా పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి భారీ వలసలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, రవి, బాబా తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయండి



ఆత్మకూర్: మండలంలో అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి అన్నారు. శనివారం లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు మండలంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాలేదని, పక్క నియోజకవర్గాల్లో ఇప్పటికే ఇళ్ల కేటాయింపులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా నా ఎమ్మెల్యే, ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భారతీయుడు, ఆంజనేయులు, రాములు, బాలకృష్ణ, లాల్‌మహ్మద్, లబ్ధిదారులు ఉన్నారు.

'మిషన్ భగీరథ' గేట్‌వాల్వ్ లీకేజీ



అమరచింత: పట్టణంలోని బస్టాండ్ వెనకాల ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ గేట్‌వాల్ లీకేజీతో నీరంతా వృథాగా పోతుంది. మిషన్ భగీరథ పంప్‌హౌజ్ నుంచి హైస్కూల్ ఆవరణలోని ఓవర్ హెడ్‌ట్యాంక్‌తో పాటు దళమికట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంక్‌కు నీటిని సరఫరా చేయడానికి పైప్‌లైన్‌ను అమర్చారు. బస్టాండ్ వెనకాల పైప్‌లైన్‌కు సంబంధించి గేట్‌వాల్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గేట్‌వాల్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పారుతున్న సంబంధిత భగీరథ అధికారులు, సిబ్బంది పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గేట్‌వాల్ మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

వాన కురిసింది.. అరక కదిలింది



ధర్మాపురం శివారులో అరక దున్నుతున్న రైతు



నాగల్‌కడ్మూర్ శివారులో విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

అమరచింత: రెండు రోజుల నుంచి మండలంలో ఓ మోస్తారు వర్షం కురవడంతో అన్నదాతలు పొలం బాట పట్టారు. భూమి చదును చేసి నెల రోజుల నుంచి వర్షం కోసం ఎదురు చూసిన రైతు తాజా వర్షాలతో విత్తనాలు విత్తుతున్నారు. గతంలో నాటిన కంది, పత్తి విత్తనాలు సరైన నీటి తడి లేక పొలంలో మాడిపోయాయి. ప్రస్తుతం రుతుపవనాలు ప్రవేశించడంతో మళ్లీ విత్తనాలు నాటుతున్నారు. మండలంలోని ధర్మాపురం, నాగల్‌కడ్మూర్ శివారులోని వ్యవసాయ పనుల్లో రైతులు బీజీగా ఉన్న సన్నివేశాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

పార్టీలో యువతకు ప్రాధాన్యం

వనపర్తి టౌన్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని గద్వాల నియోజవర్గ కాంగ్రెస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రతినిధిగా పట్టణానికి చెందిన నందిమళ్ల త్రినాథ్ ఎంపికయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు త్రినాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో యువతకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.
వీపనగండ్ల: వనపర్తి నియోజకవర్గ లీడర్‌షిప్ డెవలప్ మేనేజ్‌మెంట్ ప్రతినిధిగా వీపనగండ్లకు చెందిన డాక్టర్ బీరయ్యయాదవ్‌ను ఏఐసీసీ నియమించడంపై మండలంలోని కాంగ్రెస్ నాయకులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. వీపనగండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న బీరయ్యయాదవ్‌ను ఎల్‌డీఎంగా నియమించడం పార్టీకీ ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. వనపర్తి ఎల్డీఎంగా నియమిచండంలో కీలకపాత్ర వహించిన రాజేశ్, లీలోతియా, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి బీరయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

పాన్‌గల్: అర్హత కలిగిన రైతులకు పీఎం కిసాన్ డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమ కావాలంటే ఆధార్ అనుసంధానంతో ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని ఏఈఓ నరేష్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని మాందాపూర్‌లో ఈకేవైసీపై రైతులకు అవగాహన కల్పించారు. ఇంకా ఈకేవైసీ చేయించుకోకుండా మిగిలిపోయిన రైతులు పంచాయతీ కార్యాలయం వద్దకు వస్తే వారి వివరాలను నమోదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఉంటే వారి ఇంటికే వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నట్లు ఏఈఓ తెలిపారు. మిగిలిపోయిన రైతులు ఈనెల చివరి నాటికి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన సాగాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని కేతేపల్లి ప్రాథమిక, భగత్‌సింగ్‌నగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను, ఉన్నత పాఠశాలల్లో రాగి జావ పంపిణీని ఆయన పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలకు అందజేసిన పాఠ్య, రాత పుస్తకాలను విద్యార్థులందరికీ అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య, హెచ్ఎంలు శివకుమార్, వెంకటేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి



ఆత్మకూర్: బహుజన్ సమాజ్‌వాది పార్టీ వ్యవసాయ రాష్ట్ర కన్వీనర్‌గా మండలంలోని తిప్పుడంపల్లికి చెందిన పాండురంగయాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం పాండురంగకు నియామకపత్రం అందించారు. రాష్ట్రంలో రైతాంగం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, రైతు రుణమాఫీ కాక, కొత్తగా అప్పులు పుట్టక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. రైతులకు ఒకేసారి రుణ మాఫీ చేయాలని, బ్యాంకుల్లో కొత్తగా రుణాలు అందేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. బహుజన రాజ్యాధికార ప్రస్థానంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యత లోపించొద్దు



జీపీ భవన నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న పీఆర్ ఏఈ

పాన్‌గల్: నూతన జీపీ భవన నిర్మాణం నాణ్యతగా, నిబంధనల మేరకు నిర్మించాలని పీఆర్ ఏఈ సత్తయ్య అన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.20 లక్షలతో నిర్మించే భవనానికి తండా సర్పంచ్ శాంతమ్మతో కలిసి మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం పనులు నాణ్యతగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, పంచాయతీ కార్యదర్శి నర్మద, గిరిజన సంఘం జిల్లా నాయకుడు బాల్యానాయక్, తండావాసులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న నాయకులు



అమరచింతలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని ప్రతి ఇంటికి చేరాయని, వాటి గురించి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు. శనివారం బీజేపీ మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మోదీ సారథ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మూడు కోట్ల గృహాలు నిర్మించినట్లు తెలిపారు. 3.48లక్షల మంది వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి ద్వారా రూ.6.06 కోట్ల మొత్తాన్ని రుణాలుగా అందించారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం పంపిన నిధులు పక్కదారి పట్టిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం తమ స్వలబ్ధి కోసం వాడుకుంటుందని మండిపడ్డారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, అశోక్‌కుమార్, నరాల నారాయణ, వెంకటేశ్వర్లు, పారుపల్లి సురేష్, విష్ణు, జగన్నాథం, నరసింహ, గొల్ల శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
ఖిల్లాఘనపురం: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25వ తేదీన జరిగే నవ సంకల్ప సభను విజయవంతం చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, మండల ఇన్‌చార్జ్ శ్రీశైలం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే సభకు ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు అంజనేయులు, శివశంకర్ పాల్గొన్నారు.
పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా నిర్వహించే బీజేపీ భారీ బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన శ్రీరంగాపురం మండల కేంద్రంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబ పార్టీని ఇంటికి పంపిచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి, రాములు, రాజు, జానయ్య, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.
కంభాళాపురంలో..
ప్రధాని నరేంద్రమోడీ 9 ఏళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మండల బీజేపీ నాయకులు శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారు తెలంగాణ పేరుతో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో డివైడర్ల ఏర్పాటు



బట్టర్‌ఫ్లై లైట్ల స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని పురపాలిక చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ తెలిపారు. శనివారం రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న డివైడర్లు, బట్టర్‌ఫ్లై లైట్ల ఏర్పాటును పరిశీలించారు. పట్టణంలో ముప్పై ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు విస్తరణ పనులను మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో విజయవంతంగా పూర్తి చేశామన్నారు. అలాగే పరమేశ్వరస్వామి చెరువు నుంచి గాంధీచౌక్ వరకు ఒక మీటరు ఎత్తులో రూ.2కోట్ల నిధులతో బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, నెల రోజుల్లోగా పనులను పూర్తవుతాయని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెన్నయ్య, పోషన్న, యాదమ్మ, మండ్ల రామకృష్ణ, తబస్సుంమోసీన్, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

క్షయ నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి

పాన్‌గల్: జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా దగ్గు, జ్వరం, అలసట, దగ్గినప్పుడు తెమడలో రక్తం పడటం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించి తెమడ పరీక్షలు చేయించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. దీంతో పాటు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు వివరించారు. దీంతో పాటు మండలంలోని కదిరెపాడులో ఏఎన్ఎం సుమిత్ర ఆధ్వర్యంలో టీబీ నివారణపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఉద్యోగి నియామకమా?



మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమరచింత: మున్సిపాలిటీలో పార్ట్‌టైం ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగులను నియమించడం ఎంత వరకు సమంజసమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ ప్రశ్నించారు. మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం, ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఇవ్వాలంటూ మున్సిపల్ మేనేజర్ బాలగోవింద్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ గతంలో వర్క్ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాల్‌మెంట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి రాజీనామా చేశారన్నారు. వీటి నియామకం కోసం ప్రకటన చేయకుండానే అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల సహకారంతో ఉద్యోగాన్ని భర్తీ చేయడం సరైంది కాదన్నారు. పట్టణంలో 500 వందల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, అలాంటి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు సరైన వివరణ ఇవ్వకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మేర్వరాజు, నరాల నారాయణ, మరాఠి అశోక్, పారుపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

పెద్దకొత్తపల్లి: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కమిటీ నాయకులు ఆర్ శ్రీనివాసులు కోరారు. పెద్దకార్పాములలో శనివారం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20 ఏళ్ల కిందట పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం సర్వే నంబర్ 301, 302లో 19 ఎకరాల 14 గుంటల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. నేటికి పంపిణీ చేయకుండా వదిలివేయడంతో ఆ స్థలంలో విజయ డెయిరీ, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు. మిగిలిన స్థలాలను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. చిన్నకొత్తపల్లి, కొత్తయాపట్ల, పాతయాపట్ల గ్రామాల్లో ప్రభుత్వం సేకరించిన భూమిని పేదలకు పంపిణీ చేయకపోవడంతో ఇతరులు ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, దశరథం, బాలకృష్ణయ్య, మల్లయ్య ఉన్నారు.

ఈద్గా పరిసరాలు శుభ్రం చేయాలని వినతి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని గోపాల్‌పేట రహదారిలో గల ఈద్గాలో పరిశుభ్రత పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ముస్లిం పెద్దలు శనివారం మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు గులాం ఖాదర్‌ఖాన్, అనీస్, అఫ్జలొద్దీన్, మునిరుద్దీన్ మాట్లాడుతూ.. ఈ నెల 29న బక్రీద్ పండగ ఉందని, పట్టణానికి చెందిన ముస్లింలు అంతా ఈద్గాకు వెళ్లి ప్రార్థనలు చేస్తారని చెప్పారు. వందలాది మంది ప్రార్థనలకు వచ్చే ఈద్గాలో అపరిశుభ్రత నెలకొందని, పాలక వర్గం ప్రత్యేక చొరువ తీసుకొని పరిసరాలను శుభ్రం చేయించాలని కోరారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో ముందస్తుగా చర్యలు చేపట్టి ప్రార్థనలకు అనువుగా ఈద్గాను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

కష్టపడ్డ వారికే పార్టీ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రాజశేఖర్

వీపనగండ్ల: నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆపద పరిస్థితుల్లో ఉండి, పార్టీకి మనుగడ లేని సమయంలోనూ చింతలపల్లి జగదీశ్వర్‌రావు కార్యకర్తలకు చేయూతనందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగదీశ్వర్‌రావుకే పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని పీసీసీకి విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. అధికార దాహంతో అధికార పార్టీలో చేరేందుకు తహతహలాడిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీపై నియోజకవర్గంలో పెరుగుతున్న ఆదరణను చూసి పార్టీలో చేరేందుకు చొరవ చూపుతున్నారని ఆయన అన్నారు. అహర్నిశలు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించిన జగదీశ్వర్‌రావుకు టికెట్ అందించడమే సమంజసమని అన్నారు. కార్యక్రమంలో రాముడు, సహదేవుడు, లక్ష్మి, నర్సింహానాయుడు, విష్ణు, ఆంజనేయులు, శ్రీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నత్తనడకన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెబ్బేరు: దళిత, నిరుపేదలకు కుటుంబాలకు నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇంటి పనులు నత్తనడక సాగుతున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజనేయులు మండిపడ్డారు. శనివారం మండలంలోని పాతపల్లిలో నిర్మాణం అవుతున్న ఇళ్లను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి అంజనేయులు మాట్లాడుతూ దళితుల కోసం ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లు రెండున్నరేళ్ల నుంచి నత్తనడకన కొనసాగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పడుతుండడంతో ఈ ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయే అవకాశం ఉందని, ప్రభుత్వ యంత్రాగం, కాంట్రాక్టర్లు యుద్ధ ప్రాతిపదికన వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజయ్, దేవన్న, ప్రసాద్, లబ్ధిదారులు పార్వతమ్మ, సాయమ్మ, జ్యోతి, లలితమ్మ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెంచుగూడెలలో వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని మొలచింతలపల్లి సమీపంలోని భ్రమరంభ కాలనీ, మొలచింతపల్లి చెంచుగూడెం, ఎల్లూరు చెంచుగూడెంలో ఐటీడీఏ మన్ననూర్ ఆధ్వర్యంలో పెంట్లావెల్లి పీహెచ్‌సీ డాక్టర్ల సమక్షంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులందరికీ ఉచిత చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు చికిత్సలు నిర్వహించి మందులు అందజేశారు. రక్తహీనత వున్న చిన్నపిల్లలను గుర్తించి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్, రోహిత్, రాజీవ్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలి



వనపర్తిలో శ్రీశితను శాలువాతో సన్మానిస్తున్న మేఘారెడ్డి

వనపర్తి టౌన్: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు గుర్తించాలని, తల్లిదండ్రులు అందుకు అనుగుణంగా ప్రోత్సహిస్తే ప్రపంచంలోనే భారత్ అన్ని రంగాల్లో ముందుంటుందని పెద్దమందడి ఎంపీపీ తూడి మెగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 2వ వార్డుకు చెందిన రాజేష్‌కుమార్‌శెట్టి కుమార్తె శ్రీశిత నీట్‌లో ర్యాంక్ సాధించడంతో ఎంపీపీ మేఘారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖిల్లాఘనపురం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రమేష్‌గౌడ్, పెద్దమందడి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సత్యారెడ్డి, సతీష్‌కుమార్, వెల్టూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఏదుట్ల జైపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, మన్నెంకొండ, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: జవహర్ నవోదయ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల్లో ఆత్మకూర్‌కు చెందిన విద్యార్థి ఆసీంహకీంఅహ్మద్ ఎంపికయ్యాడని విశ్వభారతి హైస్కూల్ నిర్వాహకులు బాల్‌రాజు, చంద్రయ్య తెలిపారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో నవోదయ వట్టెంలో సీటు సాధించిన విద్యార్థి ఆసీంహకీం ను అధ్యాపకులు, స్థానికులు అభినందించి శాలువాతో సత్కరించారు.